క్లుప్తంగా

కుటుంబ కథానాయకుడు శోభన్‌బాబు



శోభన్‌బాబు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

డాబాగార్డెన్స్: మంచి కుటుంబ కథానాయకుడిగా సోగ్గాడు శోభన్‌బాబు గుర్తింపు తెచ్చుకున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కొనియాడారు. డాబాగార్డెన్స్ ప్రెస్‌క్లబ్ జంక్షన్‌లోని శోభన్‌బాబు విగ్రహానికి సోమవారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కోడూరు కనకరాజు, ఇతర ప్రతినిధులను అభినందించారు. ఇటువంటి కథానాయకుడిని నేటి తరాల హీరోలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఏఎన్నార్, ఎన్టీఆర్‌లతో పోటీపడే కృష్ణ, శోభన్‌బాబులు ఏడాదికి నాలుగైదు సినిమాలు తీస్తే ఏడాది వరకు ఆడేవన్నారు. మల్లెపువ్వు చిత్రంలో శోభన్‌బాబు నటించిన తీరు ఎన్నటికీ మరచిపోలేనిదన్నారు. తాను కృష్ణ అభిమాని అయినప్పటికీ ఇంట్లో ఆడపడుచులు మాత్రం శోభన్‌బాబును అమితంగా ఇష్టపడే వారిని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు దొడ్డి బాపూ ఆనంద్, కొల్లి సింహాచలం, నాయకులు గాలి రాంబాబు, ధనలక్ష్మి, మహేష్, పిలకా మోహన్, పెంటకోట బాబూరావు, కృష్ణారెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సీతమ్మధార: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో నిర్వహిస్తున్న ధర్నా 14వ రోజుకు చేరుకుంది. సోమవారం క్రిస్మస్ సందర్భంగా వేడుకలు నిర్వహించి కేక్ కట్‌చేశారు. యూనియన్(సీఐటీయూ) జిల్లా నాయకురాలు సిహెచ్.దేవి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, రిటైర్మెంట్ వయసు పెంచాలని తదితర డిమాండ్లు చేశారు.

బి.ఎస్.రెడ్డికి అటల్ గౌరవ్ సమ్మాన్ పురస్కారం



అవార్డు అందుకుంటున్న బి.ఎస్.రెడ్డి

సీతంపేట: అంతర్జాతీయ మెజీషియన్, నగరవాసి బి.ఎస్.రెడ్డి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అటల్ గౌరవ్ సమ్మాన్–2023 అవార్డును కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి మహేంద్ర కలుభాయ్ ముంజపర చేతుల మీదుగా అందుకున్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా అటల్ ఫౌండేషన్ సోమవారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అత్యంత ప్రతిభ కలిగి దేశవిదేశాల్లో తమ ప్రతిభ పాటవాలతో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన వారి సేవలకు గుర్తుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బి.ఎస్.రెడ్డిని నగరానికి చెందిన పలువురు మెజీషియన్లు అభినందించారు.

యువతి అదృశ్యం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మురళీనగర్ సింగరాయిమెట్ట ప్రాంతంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న పైడి మానస బీటెక్ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటోంది. తరచూ అక్కడి వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సేవకు వెళ్తుంటారు. సోమవారం ఉదయం 4 గంటల సమయంలో సేవకు వెళ్తానని చెప్పి సదరు యువతి ఇంట్లో నుంచి వెళ్లి సాయంత్రం దాటినా రాకపోవడంతో అంతటా వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో సోమవారం రాత్రి తండ్రి పైడి నర్సింగరావు ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఏఎస్‌ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆరోగ్యం.. పదిలం

- మున్సిపల్ స్టేడియంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు
- సుమారు రూ.10 లక్షలతో పరికరాలు
- 8 వార్డుల ప్రజలకు ప్రయోజనకరం
- పాతనగరం వాసుల హర్షం

ఇది కదా అభివృద్ధి



తల్లితో ఫిజియో థెరపీ ఎక్సర్‌సైజ్ చేయిస్తున్న కొడుకు రమేష్

జగదాంబ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేశారు. ప్రజల ఆరోగ్యం మెరుగుపడేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. చిన్నా, పెద్దా, యువత అనే తేడా లేకుండా అందరూ ఆరోగ్యంతోపాటు ఆహ్లాదం పొందేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పార్కులను అభివృద్ధి చేయడంతోపాటు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. దీంతో ప్రత్యేకించి జిమ్‌లకు వెళ్లాల్సిన పనిలేకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్‌తోపాటు స్థానికులు ఇక్కడ వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని పదిలం చేసుకుంటున్నారు.

రూపాయి ఖర్చు లేకుండా..

నగరంలోని ఏ జిమ్‌కు వెళ్లాలన్నా పైసలతోనే పని. ఇందుకోసం కొందరు వ్యాయామంపై ఆసక్తి చూపించినా.. డబ్బు లేక వెళ్లని వారే ఎక్కువగా ఉన్నారు. పిల్లలకు శిక్షణ ఇప్పించాలన్నా తీసుకెళ్లే సమయం లేనివాళ్లు ఉన్నారు. ఇటువంటి వారి కోసమే ఓపెన్ జిమ్‌లు అందుబాటులోకి వచ్చాయి. పైసా చెల్లించకుండా వారికి ఇష్టమైనంత వరకు జిమ్ చేసుకునే అవకాశాన్ని జీవీఎంసీ కల్పించింది. రూ.10 లక్షల వరకు ఖర్చు చేసి ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసింది. పాతనగరంలోని 29, 33, 34, 35, 36, 37, 38, 39 వార్డులకు సంబంధించిన యువత, పెద్దలు, అనారోగ్య సమస్యలున్న వారు ఈ జిమ్‌ను ఉపయోగించుకుంటున్నారు.



మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న యువకులు

క్రీడాకారులకు అనుకూలంగా..

మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. స్టేడియంలో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో క్రికెట్, కిక్ బాక్సింగ్, బాక్సింగ్, షెటిల్, త్రోబాల్ శిక్షణలు పొందే యువకులకు ఇక్కడ జిమ్ చేసుకునేందుకు అనుకులంగా మారింది. వీరందరూ స్టేడియానికి వచ్చిన వెంటనే ముందుగా కాసేపు వ్యాయామం చేసి తరువాత వారి క్రీడా శిక్షణల్లో పాల్గొంటున్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా ఓపెన్ జిమ్‌లను అందుబాటులోకి తీసుకురావడంపై స్థానికులు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వ్యాయామం చేస్తున్న మహిళ

అందరికీ ఉపయోగకరం



ఓపెన్ జిమ్‌లు అందరికీ ఉపయోగకరంగా మారాయి. ముఖ్యంగా పేదలు, అనారోగ్యంతో ఉండే వారు ఫిజియోథెరపీ చేయించుకోలని స్థితిలో ఈ జిమ్‌లకు వచ్చి కాసేపు వ్యాయామం చేసుకుంటున్నారు. గర్భిణులు కూడా వ్యాయామం చేసేందుకు వీలుగా జీవీఎంసీ పరికరాలు ఏర్పాటు చేసింది.

– రమేష్, 39వ వార్డు

ఓపెన్ జిమ్‌తో క్రీడాకారులకు మేలు



క్రీడాకారులకు ముఖ్యంగా శరీరాకృతి అవసరం. శరీరాన్ని మలుచుకునే విధానాన్ని బట్టే క్రీడల్లో రాణించగలం. మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ వల్ల వందలాది మంది క్రీడాకారులు తమ శరీరాకృతిని చక్కగా మలుచుకుంటున్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– దుర్గా, కిక్ బాక్సింగ్ మాష్టారు, 35వ వార్డు

ప్రజారోగ్యానికి ప్రత్యేక చర్యలు



ప్రజల ఆరోగ్యం కోసం జగనన్న ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉంది. పిల్లలను ప్రత్యేకంగా జిమ్‌లకు తీసుకెళ్లడం సాధ్యం కాదు. పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడం వల్ల పిల్లలు, వాకర్స్, స్థానికుల్లో వ్యాయామం చేయాలనే ఆసక్తి పెరిగింది.

– ఆదినారాయణ, వెలంపేట 35వ వార్డు

శ్రీరాముడిగా అప్పన్న



రామాలంకారంలో అప్పన్న తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి రామాలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అధిష్ఠింపజేశారు. ఆళ్వారులను వేరే పల్లకీలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకుడు శ్రీకాంతాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎమ్మెల్యే వాసుపల్లి పెద్ద మనసు

పేదల వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



దండిల రాజుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



వార్డుబాయ్ కాలనీలో క్రిస్మస్ వేడుకల నిర్వాహకులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే

డాబాగార్డెన్స్: పేదలకు సాయమందించడంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తన పెద్ద మనసు చాటుకుంటున్నారు. ప్రజాదర్బార్‌లో ఆర్థిక సాయం కోసం వచ్చిన వినతులపై ఆయన స్పందించి సోమవారం పలువురికి నగదు అందజేశారు. 38వ వార్డు కురుపాం మార్కెట్ చిన్నమ్మవారి వీధికి చెందిన పినపల్లి బంగారయ్య, 37వ వార్డు కుంచుమాంబ గుడి రెల్లి వీధికి చెందిన దేవర శ్రీను, 31వ వార్డు డాబాగార్డెన్స్ రంగా స్ట్రీట్‌కు చెందిన వేంపడం అప్పారావు, అదే వార్డు గొల్లలపాలేనికి చెందిన దండిలా రాజు, 27వ వార్డు పాలికలవారి వీధికి చెందిన మైనం అప్పారావులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున వాసుపల్లి ఆర్థిక సాయం అందజేశారు. దీంతోపాటు 30వ వార్డు కేజీహెచ్ వార్డుబాయ్ కాలనీలో క్రిస్మస్ వేడుకల నిర్వాహకులకు రూ.10 వేలు, అప్పుఘర్ వద్ద నివసిస్తున్న గుర్రాల శేఖర్ ఇటీవల చనిపోవడంతో పెద్దకర్మ కోసం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు మొత్తంగా రూ.45 వేలు అందించారు. ఆయా ప్రాంతాల్లో యువత, మహిళలు ఎమ్మెల్యే వాసుపల్లికి పెద్ద ఎత్తున స్వాగతం పలికి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పలువురు డైరెక్టర్లు, పార్టీ జిల్లా, రాష్ట్ర నాయకులు, పలు ఆలయాల చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

బాధితుడికి వాసుపల్లి పరామర్శ

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి పాలికలవారి వీధికి చెందిన మైనం అప్పారావుకు రోడ్డు ప్రమాదంలో చెయ్యి విరిగింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బాధితుడిని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, డైరెక్టర్ పద్మనాభం అమ్మాజీ, రామాలయం, పరదేశమ్మ ఆలయ చైర్మన్ పాలికల స్వామినాయుడు, పాలికల వీర్రాజు, అజయ్‌రెడ్డి, కె.మధు, అంగటి కుమారి, ఎస్.మల్లేశ్వరి, ఈతలపాక రవిశంకర్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



మైనం అప్పారావుకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

బహుముఖ ప్రజ్ఞాశాలి వాజ్‌పేయి

జయంతి వేళ నేతల ఘన నివాళులు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీ జీవీఎల్



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ, రవికుమార్

మహారాణిపేట: మాజీ ప్రధాని వాజ్‌పేయి బహుముఖ ప్రజ్ఞాశాలి అని నేతలు స్మరించుకున్నారు. ఆయన హయాంలో దేశం అన్ని రంగాల్లో గణనీయ ప్రగతిని సాధించిందని కొనియాడారు. వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని బీజేపీ మైనార్టీ మోర్చా నాయకుడు ఒ. ఆల్బర్ట్ ఆధ్వర్యంలో అఫీషియల్ కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ జీవీఎస్ నరసింహారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎంపీ మాట్లాడుతూ వాజ్‌పేయి పుట్టినరోజును సుపరిపాలన దినోత్సవంగా జరుపుకోవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ దక్షిణ నియోజకవర్గ కన్వీనర్ అత్తిలి శంకరరావు, ఏపీ బీజేపీ రాష్ట్ర వైద్య విభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ అప్పారావు, పాలూరి కృష్ణారావు, తులసీరామ్, రామ్ కుమార్, సుహాసిని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ జీవీఎల్ చేతుల మీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి, అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి చికిత్సాలయంలో..

మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతిని ప్రకృతి చికిత్సాలయంలో శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భాషా ప్రవీణుడు, కవి, సాత్వికుడు, సంస్కృతి , సంప్రదాయాలకు, విలువలకు కట్టుబడిన ప్రపంచ నేత వాజ్‌పేయి అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మెడికల్ విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్, ఎస్. శ్రీలక్ష్మి, ఎస్.మహేష్, బీజేపీ నగర ఉపాధ్యక్షురాలు టి.గిరిజ, యువ మోర్చా ప్రతినిధి గేదెల శ్రీహరి, బెంగాల్ నుంచి వచ్చిన బీజేపీ అభిమానులు దీప నంది, అర్పిత నంది, రూపాంకా నంది తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ విజయోత్సవం

మురళీనగర్: ఇటీవల నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ మహా సమ్మేళనంలో మురళీనగర్ వాకర్స్ క్లబ్ సాధించిన ప్రగతిపై వాకర్స్ పార్కులో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన సోమవారం విజయోత్సవం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో ప్రతిభ ఆధారంగా 8 అవార్డులతోపాటు ఆరు ప్రాయోజిత పురస్కారాలు పొందారు. ఇంతటి ప్రతిష్టాత్మక అవార్డులు పొందడం వాకర్స్ క్లబ్ చరిత్రలో ఇదే తొలిసారని చంద్రమౌళి తెలిపారు. అవార్డు గ్రహీతలను, ప్రస్తుత కార్యవర్గ సభ్యులను క్లబ్ సభ్యులు అభినందించారు.

ఘనంగా క్రిస్మస్ సంబరాలు

చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు



బిలీవర్స్ చర్చ్‌లో క్రైస్తవులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



క్రిస్మస్ కేక్ కట్‌చేస్తున్న కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, రాజు దంపతులు



జాన్‌వెస్లీకి కేక్ తినిపిస్తున్న నీలాపు సర్వేశ్వరరెడ్డి

డాబాగార్డెన్స్: నియోజవర్గంలోని చర్చిల్లో సోమవారం క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించి దైవ సందేశమిచ్చారు. క్రైస్తవులు కుటుంబ సమేతంగా పాల్గొని ఏసుక్రీస్తును ప్రార్థించారు.

38వ వార్డులోని బిలీవర్స్ ఈస్టర్న్ చర్చ్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కేక్ కట్‌చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం సంతోషాన్నించిందన్నారు. జీసెస్ చూపిన ప్రేమ, కృపతో ప్రతి క్రిస్టియన్ సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. మళ్లీ గెలుపొందేలా ప్రార్థించాలని కోరారు. కార్యక్రమంలో చర్చి ప్రతినిధులు, క్రైస్తవ పెద్దలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

➡ 36వ వార్డు గొడారిగోతులు ప్రాంతంలోని క్రైస్ట్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, మాసిపోగు రాజు దంపతులు పాల్గొన్నారు. నూతనంగా నిర్మించిన లిఫ్టను ప్రారంభించి కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో చర్చి ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, సెక్రటరీ వేంకటేశ్వరరావు, పాస్టర్ ప్రేమ్‌కుమార్, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డులోని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ నివాసంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి కేక్ కట్‌చేసి ఆయనకు తినిపించి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్ అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

కల్వరి బాప్టిస్ట్ చర్చిలో..

అల్లిపురం: అల్లిపురం కల్వరి బాప్టిస్ట్ చర్చిలో అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ ఎం.నారాయణరావు, పీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక ఆరాధనలు జరిగాయి. రెవరెండ్ కె.ఎడ్వర్డ్ విలియమ్స్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. డాక్టర్ జి.మాథ్యూపీటర్ అధ్యక్షతన జరిగిన మూడో ఆరాధనలో రెవరెండ్ జి.జాన్‌పీటర్ క్రిస్మస్ సందేశమిచ్చారు.

➡ కొబ్బరితోటలోని వేలంగిణి మాత దేవాలయం వద్ద స్వాగత రెల్లికుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు మాధవ్, ఫ్రాన్సిస్, గండి మేరీ కేక్ కట్ చేశారు.

పులకించిన జ్ఞానాపురం రక్షణగిరి

కంచరపాలెం: జ్ఞానాపురం రక్షణగిరి సెయింట్ పీటర్స్ చర్చిలో రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, పారిస్ పాస్టిల్ కౌన్సిల్(పీపీసీ) సంయుక్త ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. జీసెస్‌ను స్తుతిస్తూ క్రైస్తవులు నిర్వహించిన ప్రత్యేక ఆరాధనలతో రక్షణగిరి పులకించింది. ఫాదర్ జాన్ ప్రకాష్ దైవ సందేశాన్నిచ్చారు. క్రైస్తవులు ఏర్పాటు చేసిన ఏసు జననం పశువుల పాక సెట్‌ను అనేక మంది వీక్షించారు. పునీత పేతురు చర్చి ప్రాంగణంలో సాంస్కృతిక, ఆటల పోటీలను 41వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ ప్రారంభించారు. క్రీస్తు జననం సెట్‌ను తిలకించారు. ఇళ్ల వద్ద క్రిస్మస్ స్టార్లు, ట్రీలు, డెకరేషన్ సామగ్రి అలంకరణతో జ్ఞానాపురం వీధులు కళకళలాడాయి. సోమవారం సాయంత్రం రక్షణగిరిలో నిర్వహించిన జాతరకు నగరం నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



కల్వరి బాప్టిస్ట్ చర్చిలో క్రిస్మస్ సందేశం అందిస్తున్న రెవరెండ్ జి.జాన్‌పీటర్



రక్షణగిరిలో నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలు



విశేష అలంకరణలో మేరీమాత



కొబ్బరితోటలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న స్వాగత రెల్లికుల సంఘం సభ్యులు



జ్ఞానాపురంలో క్రీస్తు జననం సెట్‌ను తిలకిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కల్వరి బాప్టిస్ట్ చర్చిలో క్రీస్తు కీర్తనలు ఆలపిస్తున్న యువతులు

కాపుల ద్రోహి పవన్ కల్యాణ్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కాపు నేతలు

సీతమ్మధార: గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కాపులకు అన్యాయం చేసిందని, అటువంటి పార్టీకి మద్దతు పలికి కాపుల ఆత్మాభిమానాన్ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలుగుదేశానికి తాకట్టు పెట్టారని వైఎస్సార్‌సీపీ కాపు నేతలు మండిపడ్డారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ ఉత్తర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కాపు యువత ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబును కాపు నాయకులు కలవాలంటే అపాయింట్మెంట్ ఇచ్చే వారు కాదని, అలాంటి పార్టీకి మద్దతు పలుకుతూ పవన్ కల్యాణ్ కాపుల ద్రోహిగా మారారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన మద్దతుతో పోటీ చేసిన ప్రతి ఒక్కరినీ ఓడించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధిని కొనసాగించేలా అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్, సమ్మిట్ల వెంకటేష్ పాల్గొన్నారు.